
# రాముడొచ్చాడు

వావిలాల సుబ్బారావు




కష్టపడి భద్రాచలం వచ్చి "యాదగిరి" సత్రంలో మడత మంచంమీద నడుము వాల్చాను. ఎదురుగా వేపచెట్టు. దాని వెనకాల మసకగా వెలుగుతున్న చంద్రుడు. ఈ బహుళ పంచమి జ్యోత్స్న నన్నేమీ భయపెట్టడం లేదు.

చెట్టువైపు చూస్తూ పడుకున్నాను. ఆకుల గుత్తులలో ఏవో అలికిడిగా రూపాలు. 'దమ్మక్కలు' 'రామదాసులు' 'నరసింహదాసులు' కదుల్తున్నట్లున్నారు. ఈ చోటు విడిచిపెట్టలేకున్నట్లున్నారు పాపం! చూస్తుండగానే కునుకు పడుతున్నది. ఎవరో తట్టినట్లయింది.

"ఎవరు?"

"నేనే రాముణ్ణి."

ఎవరు చెప్మా! ఈపేరుగల వాళ్ళెవరూ నాకు తెలియదే! గుర్తుపట్టనట్లున్న నా ముఖంచూసి "నేనే శ్రీరామచంద్రుణ్ణి" అన్నాడు.

ఆ సినిమా వాలకం అదీ చూస్తే నిజమేనేమో ననిపించింది.

"ఏం పనిమీద వచ్చావు?"

"నువ్వేగదా నా దగ్గరికి పని మీద వచ్చావు."

"నాకేం పనుంది! ఊరికే చూసిపోదామని వచ్చా."

"నా క్షేత్రానికి వచ్చేవాళ్ళకు ఆ చూడటమే పని."

"ఇది నీ క్షేత్రమా! భలేవాడివే!! ఇది రామదాసు క్షేత్రం!"

"పోనీలే. మా యిద్దరిలో ఎవరిదయితే నేమి. వచ్చావుగదా అని పలకరించ వచ్చాను."

అంతగా పలకరించవచ్చిన వాడిని నుంచోపెట్టి మాట్లాడటం మర్యాద కాదనిపించింది. ప్రక్కనే మిత్రులు "ధనం" గారు వేసుకున్న మంచం చూపి కూర్చోమన్నా. ఎందుకులే అన్నట్లు కూర్చున్నాడు. ఏకవచనంలో మాట్లాడుతున్నాను. ఏమన్నా అనుకుంటాడేమో! ఎందుకనో "మీరు" అనబుద్ధివేయలేదు. అటూ. ఇటూ కాకుండా మాట్లాడదాం పోనీ.

"ఇంతకీ నీవు రామదాసు రాముడేనంటారు?"

ఈ తెలుగు వాక్యంలోని వ్యాకరణదోషం దేవనాగరీ రాముడికి తెలియవచ్చిందా అని దైర్యం.

"జానకీ రాముడు- దశరథరాముడు ఇవన్నీ తీసివేసి కొత్తపేరు పెట్టావే."

"నీవున్నావన్న నమ్మకమే కుదరంది నీవాళ్ళ పేర్లమీద నాకేం విలువ? రామదాసు మీద అనుమానం లేదు. అందుకని అతని ద్వారా నిన్ను గుర్తుతెచ్చుకుంటున్నా—"

"పోనీ అతని మీద అంత భక్తా."

"ఎందుకంత నమ్మకం. లోకం డబ్బు దుర్వినియోగం చేశాడనా?"

"దుర్వినియోగ మేమిటి — అంతా నీకే గదా కులకబెట్టాడు."

"నన్ను నమ్మనంటూ నాకు పెట్టాడంటావేం!"

నేను పప్పులో కాలు వేస్తున్నానని నాకే తెలుస్తున్నది.

"పోనీ నిన్నుగూర్చిన భావానికి."

"ఆ భావం అతనిదే అయితే పెట్టిన ఖర్చుకూడా అతని భావానికే చెందుతుంది గదా! మరి నాకు పెట్టాడంటావేం"

దారి దొరకటం లేదు. ఈయన సంగతేమిటో నిగ్గదీస్తే. కొంత గాలి అయినా పీల్చుకోవచ్చు.

"ఇంతకీ మీరెక్కడ నుంచి వచ్చారు? రామదాసు భావంలోనుంచా! స్వంత అడ్రసులో నుంచా!"

ఒక డిప్లమేటిక్ చిరునవ్వు నవ్వాడు.

"ఒహో మీరు నవ్వుతారు కూడానా!"

"ఎందు కనుమానం వచ్చింది."

"రాము డెక్కడా నవ్వినట్లు జ్ఞాపకం లేదు. మా అన్నయ్యలాగా ఎప్పుడూ సీరియస్‌గానే ఉంటారనుకున్నాను."

"మీ అన్నయ్య ఎవరు"

"అది తెలీకపోతే నువ్వేం దేవుడివి. నీ ఎదురుగా మంచం మీద పడుకున్నాయనే. పైగా నీపేరే."

"అతని నమ్మకాలమీద నాకు నమ్మకం లేదు. అతని జీవితం మీదనే నా నమ్మకం."

"నవ్వకపోవటమేం. పైకి నవ్వనివాళ్ళు లోపల చాలా నవ్వు వుంటుంది."

"ఈ వేదాంతం నాకు బోధపడదుగాని— మీరు వచ్చిన పని అయిందా! నాకు నిద్ర వస్తున్నది...."

"చెప్పనివ్వకుండా అడ్డుపుల్లలు వేస్తుంటివి...."

"ఆఁ.చెప్పండి తానీషా రాముడుగారూ."

"ఇంకో కొత్తపేరు తగిలించావేమిటి? ఇందాక రామదాసు రాముడన్నావు!"

"రామదాసు రాముడు భావంలోను. ఏడుపులోను మాత్రమే ఉన్నాడు. కంటికి కనిపించి మూటలకు మూటలు డబ్బు ముట్టచెప్పింది తానీషాకేగా! మీ కోసం అంత ఏడ్చినవాడికి కొరడా దెబ్బలు—కొట్టించిన వాడికి డబ్బుల మూటలు. ఇదేనా మీ రామరాజ్యం!"

"మా తమ్ముడిలాగా ఎందుకంత కోపం-

తొందరపడకు...."

"దొంగ చిరునవ్వులు - బుద్ధిమంతుడి ఫోజులువేసి మంచిపేరు తెచ్చుకోవాలన్న కీర్తి కండూతి నాకు లేదు.... (మళ్ళీ చిరునవ్వు వేస్తున్నాడు) అదుగో కోపగిస్తున్నా చిరునవ్వు నవ్వితే ఇంకేం చెయ్యను."

"అది కాదోయ్ — తానీషాకు ముట్టింది డబ్బేగా! రామదాసుకు ముక్తి — రామదాసు క్షేత్రమని నువ్వేగా అన్నావు. అదెంత కీర్తి!"

"రామదాసు అవి కోరాడా? ముక్తి. కీర్తి నిన్నడిగాడా! ఒకసారి కంటికి కనిపించమన్నాడు. "నీ అంద నాకు - నీ వెందుబోకు" అన్నాడు. నీవేమో పోయి తానీషాకు కనిపిస్తివి. అడిగిందొకటి, ఇచ్చేదొకటి. నీ రాజ్యంలో తీర్పులన్నీ ఇట్లాగే వుండేవా!"

"నేనే లేనంటివిగా ఇంక నా రాజ్యం ఎక్కడిది?"

"ఇప్పటికీ అదేమాట అంటాను. నువ్వెక్కడున్నావు-నిజానికి నీ తండ్రి వాల్మీకి."

"పోనీ అప్పటి నుంచయినా ఉన్నానుగా"

ఇంకేం మాట్లాడను! ఎక్కడికక్కడకు సరిపెట్టుకుంటూ వాదిస్తుంటే వాదనేం సాగుతుంది! సరే నన్నాను.

"ఒప్పుకున్నావు కాబట్టి చెపుతున్నాను...."

"ఏమిటి ఒప్పుకున్నాను. రాముడనే భావం ఒప్పుకున్నాను. అది గొప్పదనాలేదు- అందరికీ ఉండనాలేదు."

"అదేలే! ఆ భావం ఉన్న వాళ్ళందరికీ అది సత్యమేగా."

"భావమే భగవంతుడురా! అని మా జిల్లెళ్ళమూడి అమ్మ చెప్పిందిగా. నిజమేనేమోలే."

"ఆమె మాత్రం ఎక్కడనుంచి చెప్పింది నాలోనుంచేగా!"

"పోనీలెమ్మని కాస్త ఒప్పుకుంటే అంతా నేనేనంటున్నావే! అరబ్ అండ్ ది కామెల్ లాగా."

"ఇంతకీ సంగతేమిటంటే నువ్వేదో చలంమీద థీసిస్ వ్రాస్తున్నావుటగా"

"అవును. చలంగారు మీకు తెలుసా!"

"బాగా తెలుసు."

"అట్లాగా! నమస్కారమండీ! ఆయనో కాదు ఆయన్ను ఎరిగినవారన్నా నాకు గౌరవమే— ఎప్పుడు చూశారు ఆయన్ను"— రాముడన్న విషయం మర్చిపోయినాను. ఇంత ఎక్కువసేపు మాట్లాడడంవల్ల దేవుడనిపించటం లేదు.

"ఎప్పుడూ చూస్తూనే వున్నాను. ఇప్పుడు నా దగ్గరే వుంటున్నాడు"— మళ్ళీ దేవుడి లెవెల్లో మాట్లాడుతున్నాడు.

### ఉజ్జోగం



క్రలలో కనిపిస్తావు
కమ్మగా నవ్వేస్తావు
కల 'వరించే'
కోర్కెవు
కలవెలా అవుతావు.

— ఆరతీ మూర్తి, ఉషాకిరణ్

"మీ దగ్గర ఎందుకుంటాడు? మీ మీద ఆయనకు ఎప్పుడూ గౌరవం లేదు. ఆయనకు రావణాసురుడంటేనే ఇష్టం. వుంటే ఇంకా ఆయన దగ్గర వుండవచ్చు."

"రావణాసురుడు కాదా నా దగ్గరే వుంటున్నాడుగా."

"పెద్ద సత్రంగాని పెట్టారేమిటండీ ఇంత మంది వుండటానికి- అయితే ఇప్పుడు రావణుడూ మీరూ కొట్టుకోవటం లేదా!"

"వాళ్ళు మళ్ళీ జయవిజయులయిపోయినారుగా!"

"సరే సరే! మళ్ళీ పురాణాలు పట్టుకున్నారా? చెప్పండి చలంగారి సంగతేమిటన్నారు" అన్నాను.

"చలం మీద వ్రాస్తున్న థీసిస్ నాకు అంకితం ఇవ్వాలి."

"అది చలంగారికే అంకితం అని ఎప్పుడో అనుకున్నాను. అయినా మీరిదేమిటి! ఇట్లా ప్రారంభించారు. అంకితాలడిగే దేవుళ్ళ గొడవ హరిహరనాథుడు- శ్రీకాకుళాంధ్ర విష్ణువులతో అయిపోయిందనుకున్నాను. మీరేమిటి ఈదారి పట్టారు! ఎవరయినా కావ్యాలు వ్రాసే వాళ్ళను పట్టుకోండి."

"కాదు ఇదే కావాలి."

"నేనివ్వను బాబు! పైగా నాకుగాని, మా గురువు చలం గారికి గాని మీమీద గౌరవం అంతంత మాత్రమే. మీకు అంకితమిస్తే చలంగారికి కోపం కూడా రావచ్చు. 'ఇదట్రా నన్ను అర్థం చేసుకున్నది' అంటారు మా మాష్టారు."

"నామీద ఆయనకు కోపమని ఎట్లా అనుకున్నావు?"

"మీరు ఆయన పుస్తకాలేమీ చదవలేదట్లుంది— ఎందుకయినా మంచిది చదవకండి."

"తెలుసునోయ్...." చాలా వరకు వచ్చింది. ఓయ్ గీయ్ అంటున్నాడు....

"ఆయనకున్న కోపం నామీదకాదు. నేను ధర్మమనుకొని ఆచరించిన నియమంమీద— అందుకు ఇతర్లను పెట్టిన కష్టంమీద."

"మీ ఆచరణ కాకుండా మీరువేరే ఉన్నారేమిటి మిమ్మల్ని గౌరవించటానికి? ఎందుకొచ్చిన బుకాయింపు వాదనలివి!"

"వేరే ఉన్నాను. ఈ కర్కశ ధర్మం నా పాలబడ్డది. దాన్ని ఆచరించవలసివచ్చిన ఈ ఖర్మకు లోలోపల ఎంత ఏడ్చానో నీకేం తెలుసు. ప్రేమంటే తెలిసిన చలానికి తెలుసు. లోపల ఏడుస్తూ చేసే బదులు ఆ ధర్మాన్నే వదిలివెయ్యవచ్చుగదా అంటాడు అతను. అక్కడే అతనికీ నాకూ పేచీ!"

"ఇంకా పేచీ ఏముందిలెండి- మీలోనే కలిశాడంటున్నారుగా! పైగా చివర్లో శూన్య సాధన కూడా అలవాటు చేసుకొనే—ఇంకా ఏముంది? అంతా శాంతమే."

"లేదోయ్ ప్రేమ విషయంలో మాత్రం అల్లరిపెడుతునే వున్నాడు."

"నిజంగానే!! అందుకేనండీ ఆయన అంటే అంత గౌరవం నాకు. ఇంకా మీతో తగాదాపడుతునే వున్నాడన్నమాట. భేష్! భేష్!!"

"ఇంతకీ నీ పుస్తకం సంగతేమిటి?"

"ఇప్పుడనలివ్వను. మీతో చలంగారి తగాదా సమసిపోయిందంటే ఏమయినా మెత్తబడేవాడినేమోగాని— ఇప్పుడా! ఉహుం."

"సరే కాదన్నావుగా. ఇంకెందుకు వెడుతున్నాను" మంచంమీదనుంచి లేవబోతున్నాడు. పాపం జాలివేసింది పెద్దమనిషిని కాదన్నానే అని.

"ఏమండోయ్-ఆగండి ఒక్కమాట—" రామచంద్రా అని నోరారా పేరుపెట్టి పిలవబుద్ధిపుట్టలేదు. అది తెలిసినట్లున్నది.

"నేనున్నానని ఇంకా నమ్మకం కలగలేదా. పేరుతో పిలవటంలేదు?"

"మరేనండి. కాదన్నందుకు ఏమీ అనుకోకండి! అసలే మీమీద జాలిగా కూడా వుంది—"

"ఎందుకు—"

"ఇందాక 'చింతపల్లి' 'సీలేరు' మీదగా కులాసాగా బస్సులో వచ్చాం కాబట్టి ఆ అడవులు, కొండలు అంత అందంగా వుంది గాని — పాపం మీరీ అరణ్యమంతా - ఆడతోడుకూడా లేకుండా-అన్నదమ్ములు ఎట్లా నడచివచ్చారా అని దిగులుకూడా వేసింది. మాకు మిత్రులు 'ధనం'గారు వుండబట్టి నవ్వులకు లోటులేకపోయింది గాని లేకుంటేనా - మీరో హాస్యాలు కూడా ఆడుకోరయ్యె! పైగా సీతపోయిన దుఃఖం కూడా- ఎంత కష్టం నిజంగా!"

"నేనే లేకపోతే నీకు జాలి ఎందుకు? వాల్మీకి వర్ణనే అయితే నీకు రసానందమే గాని దిగులు, జాలి ఇట్లాంటివి రాకూడదే?"

ఎట్లాగయినా నా ఫీలింగ్స్ నుంచి తన అస్తిత్వాన్ని నిరూపించుకోవాలని పోరాడుతున్నాడు. నాకు నేను కవచాలు సిద్ధం చేసు

కుంటున్నాను. ఆయనకు, నాకు ఈ వాద కవచాలే అడ్డం అవుతున్నాయి.

"మిమ్మల్ని మనిషిగా ఊహించుకుంటేనే నాకు జాలి. మీరు నిజంగా అవతారమే అయితే నాకు జాలెందుకు! మీకులాగ మాకు "బల-అతిబల" విద్యలు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు వంటి మాష్టర్లు ఉంటే ఎన్ని ఆరవులయినా నడుస్తాం. అందుకనే మీరు దేవుడి వేషాలు వేస్తే నాకేం బాగుండదు. అప్పుడు మీరు మా ఆదర్శంకాదు. ఆ దేవుడి వేషాలు తీసేసి రండి- గౌరవమే."

"దేవుడిగానే చూసిన రామదాసుమీద గౌరవమేనన్నావు ఇందాక. నిజానికి అది గౌరవమా-అతని మూర్ఖత్వానికి జాలా!"

వసిష్ఠులవారు మంచి చదువే చెప్పినట్లున్నా రేవతీ అర్ధప్రశ్నలు బాగానే నేర్చాడు.

"రెండూనూ. జాలిగౌరవం కూడా. ఏదో ఒక గొప్ప విశ్వాసం — తన స్వార్థానికి ఏమీ ఉపకరించని గొప్ప నమ్మకం తన జీవితానికి అంత శక్తిని, ఓడిపోని స్థయిర్యాన్ని ఇచ్చింది. అది చాలదూ గౌరవించటానికి!"

"శక్తి ఇచ్చింది విశ్వాసమే అయితే ఆ విశ్వాసానికి ఆధారమయిన సత్యం మీదనే నీకు గౌరవముండవచ్చుగా-"

"అది సత్యమో అసత్యమో నాకేం తెలుసు! తెలిపింది వాస్తవంగా ఉన్న అతని విశ్వాసమే."

"అసత్యంమీద విశ్వాసమున్నా గొప్పవాడేనా ఏమిటి?"

"ఆ విశ్వాసాన్ని కలిగి ఉండటమే గొప్ప నా మటుకు — ఇందాక వస్తుంటే "ధారాలమ్మ గుడి" దగ్గర బస్సు ఆగింది. అందరూ వెళ్ళి వస్తున్నారు- సంగతి అడిగాను. దూరాన "ధారకొండ" మీద ఒక పెద్ద చెట్టు. దానిమీద నీటిచెమ్మ దూరానికికూడా కనిపిస్తుంది. నదులన్నీ ఎండినపుడుకూడా ఆ తడి ఆరదుట. ఆటవికులు ఈ అద్భుతానికి దైవత్వమిచ్చి గుడికట్టారు. ఆ రాతిని పగలగొట్టి ఏ శాస్త్రజ్ఞుడయినా నీటి ఊటను చూపిస్తే అది శాస్త్ర సత్యమే అయినా వాళ్ళ జీవితంలో విశ్వాసరక్తిని తీసివేస్తుంది. చప్పని శాస్త్రం మిగుల్తుంది. జీవితానికి విశ్వాసపు రుచి పోతుంది. రెంటినీ కోరేవాడు ఆ చెట్టునే దేవుడనుకోవటం మాని, అక్కడ కూడా నీటి ధారను పెట్టిన శక్తివంతుడయిన దేవుణ్ణి కల్పించుకొని విశ్వాసాన్ని శాస్త్రంతోపాటు పెంచుకుంటూ జీవితానికి రసవత్తరమయిన ఆధారాన్ని కల్పించుకోగల మానవుని మనస్సుమీద నా గౌరవం. అది రామదాసులోను, పోకలదమ్మక్కలోను తలుచుకున్నాను. పాతిక సంవత్సరాల నుంచి ఏ కోరిక లేకుండానే నీకు ఊడిగం చేస్తూ నెరిసిన తలను మోకాళ్ళ వరకు వంచుకొని నడుస్తున్న ముసలి దేవదాసి కృష్ణవేణమ్మ గారిని గుళ్ళో ఇందాక చూశాను. నిన్ను గురించిన భావనే వాళ్ళ జీవితానికి బలం. అది వున్న మనస్సే వాళ్ళగొప్పదనం. అందుకని సత్యంకన్న సత్యాన్ని నమ్మిన మనస్సుమీద నా గౌరవం-"

పాపం ఓపికగా వింటున్నాడు. ఆయన రాముడే అయితే ఇవన్నీ తెలియవా! రాముడు కాకపోతే ఏ గాలితో ఈ నా కంఠశోష?

'ఇంకా విశ్వాసం పట్టు దొరక్కగాని లేకపోతే రేపో మాపో నీవుకూడా ఇటువైపు వచ్చే వాడివే లేవోయ్' అన్నట్లు ముఖం పెట్టాడు శ్రీరామచంద్రుడు.

చినుకులు పడుతున్నాయి లేవండి సుబ్బారావుగారు అన్నారు "ధనం" గారు. మడత మంచం మడిచి బయలుదేరాను. నిద్ర గల్లంతయింది—

(చలంగారూ! మీరు ఎక్కడున్నారో గదా!)


సౌందర్య లహరి
(శ్రీ జగద్గురు శంకర భగవత్పాదుల విరచితము)
శ్రీ చదలువాడ జయరామశాస్త్రి గారి ఆంధ్ర టీకా తాత్పర్య విశేష వ్యాఖ్య, ఆయా శ్లోకముల వెంట యంత్రములు వాని పూజాదిక ప్రక్రియలు, భావనోపనిషత్తు, దానికి వివరణము, దేవీ స్తోత్ర పంచకములును, భూమికలో దేవ్యుపాసనా ప్రాముఖ్యము, మంత్ర యంత్ర రహస్యములు పూర్వపక్ష సిద్ధాంతాద్యనేక విషయములు, భారతీయ సంస్కృతి, విజ్ఞానం, శ్రీ శంకరాచార్యుల చరిత్రతోను ప్రకటితము. శ్రీ బాపుగారి త్రివర్ణ ముఖచిత్రముతో ప్లాస్టిక్ కవరుతో వెల రు.45.00
M.O. ద్వారా 40.00 రూ.. పంపిన వారికి మిగిలిన 5.00 రూ..లకే వి.పి.పి. ద్వారా పంపగలము
ప్రతులకు: శ్రీ అరుణా బుక్ హౌస్ * 103, నారాయణముదలి వీధి మద్రాసు-600 079





గుంటూరులో పెళ్ళి చీరెలు
కొని ఆదా చేయండి! కట్టుకొని ఆనందించండి!
కలకాలం నిలిచేది పెళ్ళి!
చిరకాలం నిలిచేవి
'దేవి సిల్క్స్' చీరెలు!
అన్ని మిల్లుల చీరెలు
40% వరకు తగ్గింపులో!
దేవి సిల్క్స్
బ్రాడీపేట, మెయిన్ రోడ్, గుంటూరు.
(బాంబే డయింగ్ ప్రక్కన)